
# అలసంద పువ్వు



"తాతా...! తాతా!!"

మనవడి పిలుపు. మత్తు నిద్రలో తాత. ఎక్కడి నుండో పిలుస్తున్నట్టుగా. కలలో వినిపిస్తున్నట్టు లీలగా...వినపడీ వినపడనట్లుగా!...విసుగు పుట్టిస్తున్నట్టుగా!...

తాత మూలుగుతూ ఒత్తిగిలి పడుకొన్నాడు.

"అబ్బబ్బ! ఏం మొద్దు నిద్రో కుంభకర్ణుడి నిద్ర!" మనంవడు తట్టితట్టి లేపుతున్నాడు.

అప్పుడు అర్థమయింది తాతకు మనంవడు నిద్రలేపుతున్నాడని. అయినా బద్ధకం. అలసి సొలసిన శరీరాన్ని ఆవరించిన బద్ధకం. ఆ బద్ధకంతో పడకమీద నుండి లేవకుండానే–"

"అయ్యయ్యో! నువ్వు ఇప్పుడు కూడా నన్ను నిద్రపోనీకుండా చంపితే ఎట్లా?"

"ఊ...! ఊc...! ఊc...! ఊc! ఉc!! ఊc..."

మనంవడి ఏడుపు.

"ఎట్టా నాయబ్బా నీతో ఏగులాడేది. అట్టపడి కంటారా నిద్రపొయ్యే దానికీ లేదు. కడుపు సొద ఎల కక్కేసేదానికీ లేదు. మాటెత్తితో చాలు ఏడుపు. ఇంక మిగిలింది నా ఏడుపు. నేను పాయ్ ఎవుర్తో చెప్పుకోవాల?"

"ఊc... ఊc... ఊc... రేపు సందేళకు... ఊc! ఊc! నువ్వు ఇంటి కొచ్చేకుందికి ఆc ! నేను ఇంట్లో ఉంటే అప్పుడడుగు?"

ఆ మాటతో కూడా తాత నిద్ర మత్తు వదిలిపోయింది. ఉలిక్కిపడినట్టుగా పైకి లేచాడు. పక్కన ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తున్న మనcవడు. అలాగే గుండెకు హత్తుకొన్నాడు.

"నా తండ్రివి గదా? నా బంగారు కొండవి గదనాయనా! అంత పని చెయ్యద్దు నాయనా! నేను బతకతా ఉండేది నీకోసరcవే గదరా?"

"అయితే నిద్ర లేపినదానికే అంత కసురుకోవాలో?"

"నేను చేస్తా ఉండే ఉద్యోగం ఎట్లాంటిదో నీకు తెల్దా నాయనా? లెయ్యాలంటే ఎంత పాలుమాలిగ్గా ఉంటిందో బగుమంతుడికే ఎరిక!

"నిజమే తాతా! అయినా ఈ వేళప్పుడు అడవిలో మూలుగులు వినిపిస్తా ఉంటే ఎంత భయంగా ఉంటుందో తెల్సా? నీకేం నువ్వు గురకపెట్టి నిద్రబోతావ్."

"మనిషి మూలుగులా?"

"అమ్మా! అయ్యో...! ఆc! ఊc..! దేవుడో!" కాస్త అటో ఇటోగా అర్ధరాత్రి. ప్రకృతి ఆద మరచి నిద్రపోతూ ఉంది. ఆ ప్రశాంత సమయంలో శబ్దానికి అడ్డంకులు లేనట్లుంది. అది వినిపించ గలిగినంతదూరం వినిపిస్తూ ఉంది. అందుకే మనవడిని కలవరపెట్టిన మనిషి మూలుగులు తాతకు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"అవును గదరా?"

"మరి నువ్వేcవో అన్నావే?"

తాత బద్ధకం పూర్తిగా వదలలేదు. మనcవడు వదిలిపెట్టేటట్టుగా లేదు. పడకమీద విసుగు భగవన్నామ స్మరణగా మారింది. 'రామా! గోవిందా!' అంటూ పైకి లేచాడు. మనcవడు తాత చేతిని పట్టుకొన్నాడు. ఒకరి కోసం ఒకరుగా బతుకుతున్న తాతా, మనcవడు ఆ అర్ధరాత్రి వేళలో ఆ అవుట్ హౌస్ నుండి బయలుదేరారు.

ఎదురుగా ఫారెస్ట్ బంగళా. తాత బంగళా ముందు నిలబడ్డాడు. ఆ మూలుగులు ఎటువైపు నుండి వస్తున్నాయో? గ్రహించడాని కన్నట్టుగా చెవియొగ్గి వింటున్నాడు.

తాత ఫారెస్ట్ గార్డ్. అంటే– అడవిని సంరక్షించే కావలివాడు. పగలంతా అడవిలో తిరగడమే తనపని. అలా తిరుగుతున్నప్పుడు ఎవరి చేతి కత్తిదెబ్బయినా చెట్టు మీద పడిందా? ఆ కత్తి పోటుకు వినిపిస్తుంది. ఆ శబ్దాన్ని పట్టి ఆ స్థలాన్ని పసిగట్టగలడు తాత. క్షణాల్లో సరాసరి చెట్టును నరుకుతున్న చోటుకు వెళ్ళడం వాడిని పట్టుకోవడం తన వృత్తి ధర్మం.

అది తనకు వెన్నతోపెట్టిన విద్య. అందుకే తాత మూలుగులు వినిపిస్తున్న దిశగా బయలు దేరాడు.

నీలాల నింగి నాలుగు వైపులా వంగి ఈ లోకానికి గొడుగు పడుతున్నట్లుగా ఉంది. నీలంపు గొడుగు గుడ్డమీద పొదిగిన పువ్వుల్లా నక్షత్రాలు. ఆ గుడ్డకు అక్కడక్కడ వేసిన మాసికల్లా మబ్బుతునకలు. ఆ గొడుగు నీడలో ఊపిరి బిగబట్టి సైనిక వందనం చేస్తున్న భటుల్లా ఏపుగా పెరిగిన వృక్షాలు. ఆ వృక్షాల చుట్టూ దయ్యాల్లా తలలు విరబోసుకున్న పొదలు. అర్థరాత్రి వేళలో నిద్రపోతున్న చెట్లకు జోల పాటగా జుఁయ్ మన్న రొద! ఎంతటి గుండె దిటవు కలిగిన మనిషికైనా గుండెలు దిగజార్చే భయంకర వాతావరణం!

అయితే తాతకు మాత్రం అదొక పార్కు. ఆ పార్కులో మనఁవడితో కలసి వాహ్యాళికి వెళ్ళినంత దర్జాగా చేతిలో బ్యాటరీ లైట్ దారి చూపుతుంటే తాత ముందుకు నడుస్తున్నాడు.

అది కాలి బాట కాదు. కంకర బాట కాదు. అటు ఇటు కాని బండిబాట. కొండ ఏటవాలు తలంలో వేసిన బాట. ఆ బాటకు ఒకవైపు లోయ. మరొక వైపు ఎత్తయిన కొండ. ఇరువైపులా అల్లిబిల్లిగ అల్లుకొన్న చీకి పొదలు, పరిగ పొదలు. నింగిని చుంబించా లన్నట్టుగా నిటారుగా పెరిగిన టేకు, మద్ది, మామిడి, వేప వృక్షాలు. ఆ బాటమీద నడుస్తున్న తాత ఉన్నట్లుండి ఆగిపోయాడు.

"అమ్మా...! అయ్యో...! ఆఁ! ఊఁ...! బగమంతుడా!"

మూలుగులు స్పష్టంగా వినిపిస్తున్నాయి. సందేహం లేదు. అవి మనిషి మూలుగులే!

తాత బ్యాటరీ లైట్ వెలుగుల్ని చుట్టూ ప్రసరింపచేస్తూ ఆ పొదల్లో కండ్లు చింపి వెదుకుతున్నాడు. మనవడు కూడా తాత చూపుల్లో చూపులు కలిపి చూస్తున్నాడు. మూలుగులు మాత్రం వినిపిస్తున్నాయి. కానీ మనిషి కనిపించడం లేదు. తాత చూపుల్లో సందేహం. మనవడి చూపుల్లో ఆతురత. ఇద్దరి ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో బరువు. రెప్పారని చూపులు. ఆ చూపుల్లో తీవ్రత. చుట్టుపక్కల ప్రతిఅంగుళం స్థలంమీద చూపులు పడుతున్నాయి.

"తాతా! తాతా..! అదో అక్కడ చూడు తాతా!"

తాత చూశాడు.

బక్కపలచగా చెక్కపేడు లాంటి ఆకారం. పొదల సందులో కదిలీ మెదలకుండా. కాలు జారి పడిందో?...కావాలనే పడిందో? కోనలో పడింది. సన్నగ మూలుగుతూ ఉంది. ఆ మూలుగులు కూడా ఇప్పటికో ఇంకాసేపటికో గాలిలో కలిసిపోయే తీరులో కొనసాగుతున్నాయి.

"అయ్యయ్యో! ఎట్ల పడినాడో ఏం పాడో? ఆ చెట్టు బోదె అడ్డం పడకుండా ఉంటే అయ్య పని కొయ్యే గదా? ఏ దేవుడు అడ్డపడినాడో? లేకుంటే ఈ కోనలో ఎక్కడపాయ్ పడేవాడో? పులుసులోకి ఎంవికకూడా దొరికుండదే?"

తాత తనలో తానుగా... మనఁవడికి వినిపించేలా గొణుక్కుంటూ బ్యాటరీ లైట్‌ని మనవడి చేతికిచ్చాడు. ఆ ఆకారం మీదే వెలుగు పడేటట్టుగా లైట్‌ను పట్టుకోమన్నాడు. ఆ చీకి పొదల్లో

జాగ్రత్తగా దారి చేసుకొంటూ అక్కడక్కడ... ఒంటిమీదగుడ్డలకు తగులుకొంటున్న ముండ్ల కంపల్ని విడిపించుకొంటూ- కోనలోకి దిగాడు. చెట్టు బోదె ఆధారంగా పడిఉన్న ఆ ఆకారాన్ని పట్టి పైకి లేపాడు.

మోకాళ్ళు, మోచేతులు కొట్టుక పోయాయి. నుదిటి మీద దెబ్బ తగిలింది. తగిలిన దెబ్బల్లో నుండి కారిన రక్తం ఒంటిమీద చారలు చారలుగా గడ్డకట్టింది. ఎప్పుడు పడ్డాడో ఏమో? మనిషి స్పృహలో లేడు. ఆచెట్టు దగ్గరినుండి ఆమనిషిని చీకి పొదల్ని తప్పించుకొంటూ బాటమీదికి తెచ్చేసరికి తలప్రాణం తోక కొచ్చింది.

ఆ ఆకారాన్ని.. ఆ ఆకారానికి తగిలిన దెబ్బల్ని చూస్తుంటే మనంవడి గుండె విలవిల లాడింది. కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి. అయినా తనవల్ల ఒక మంచిపని జరిగిందన్న తృప్తి ఏమో మరి? బ్యాటరీ లైట్‌తో తాతకు దారి చూపుతూ ఠీవిగా ముందు నడుస్తున్నాడు.

తాతది కష్టంచేసిన ఒళ్ళు. కాయవాటంగా ఉంది. ఆ కాయవాటం ఒంటిలో కష్టానికి తట్టుకొనే శక్తి ఉంది. దాదాపు భుజాలమీద మోసుకొని వచ్చినట్టుగా ఆ ఆకారాన్ని ఇల్లు చేర్చాడు.

గాయాలకు మందులు...వాపులకు కాపడాలు...కడుపులోకి అంత వెచ్చనిగంజి! తాతా మనంవడికి ఈ సపర్యలతోనే తెల్లారింది.

తెల్లారేసరికి ఆ ఆకారం కూడా తేరుకొనింది.

తేరుకొన్న ఆకారం కండ్లు తెరిచింది.

ముండ్ల పొదల్లో నుండి మెత్తని పడకమీదికి ఎలా వచ్చిందో ఆ ఆకారానికి గుర్తు లేదు. కండ్లు తెరుస్తూనే కంటపడింది మాత్రం తాతామనంవడు!

గుంతలు పడిన కండ్లు. ఆ కండ్లలో నుండి వింత వెలుగుతో చలించని చూపులు. ఆ చూపుల్లో కృతజ్ఞతా భావం. ప్రయత్నపూర్వకంగా ఆకారం రెండుచేతులు పైకెత్తి జోడించింది- నిమీలిత నేత్రాలతో! కను రెప్పల్ని చీల్చుకొని రెండు కన్నీటి బిందువులు లొక్కిదవడల మీద!

తాత పెదవుల మీద చిరునవ్వుల జిలుగు!

మనంవడి కన్నుల్లో మాటలకందని వెలుగు!

తూర్పు దిక్కున ఉదయభానుడు కుమ్మరిస్తున్న వెలుగు జిలుగు!

* * * * *

తాత పేరు గంగులయ్య. మనంవడి పేరు వేణు.

తాతకు కూతురు. వేణుకు తల్లి. పేరు నాగలక్ష్మి. వేణు ఈ భూమి మీద పడేవరకు బాధ్యత వహించింది. ఆ తర్వాత బాధ్యతల్ని తండ్రికి అప్పచెప్పి వెళ్ళిపోయింది.

పసుపూ కుంకంతో పోయిందని పదిమందీ మెచ్చుకున్నారు.

వేణుకు అమ్మమ్మ. గంగులయ్య భార్య వరలక్ష్మమ్మ. ఆమె కూడా అదే పని చేసింది. కూతురు బుడిబుడి నడకలమీద ఉన్నప్పుడు పడక పెట్టింది. ఆపాప పరికిణీ కట్టే వయసులో వెళ్ళిపోయింది_ పడక ఖాళీచేసి!

ఆ ఇంటి 'వరసాపిని' అన్నారు ఊళ్ళో వాళ్ళు.

వరసాపినో?... వరశాపమో? గంగులయ్యకు తిప్పలు తప్పలేదు.

ఒక్కగానొక్క కూతురని ముద్దు మురిపెంగా... ఆ కూతురు మీదే అన్ని ఆశలుగా పెంచి పెద్దచేశాడు. ఆ అమ్మాయి గుండెలమీద కుంపటి కాలేదు కానీ_ గుండెల మీద కుంపటి మాత్రం పెట్టి వెళ్ళిపోయింది.

అది ఆరని కుంపటి!

ఇక అల్లుడు. వాడు అల్లుడు కాదు గిల్లుడు. వాడి పనికిమాలిన అవసరాల కంతా గిల్లిగిల్లి చంపుతున్నాడు. కాదు గీదంటే వాడి అవసరాలు కొడుకుతో ముడిపడ్డాయి. కాలో, చెయ్యో విరగ్గొట్టి లేదా కండ్లల్లో అంత జిల్లేడు పాలు పోసి వాడినే అడ్డంపెట్టుకొని బతికినా బతుకుతాడు.

తగిలిన కాలికే తగులుతున్నట్టు బాధలు.

కూతురు ప్రాణం విడుస్తూ పలికిన పలుకులకు కట్టుబడి బతుకును అడవికి అప్పగించి పరిస్థితులతో రాజీ పడుతూ కాలాన్ని నెట్టుకొస్తున్నాడు.

అటువంటి జీవితానికే మరొక అభాగ్యుడి బాధ్యత.

కష్టపడినవాడే కష్టానికి విలువ కట్టగలడు. బాధలు పడిన వాడే బాధను అర్థం చేసుకోగలడు. గంగులయ్యకు కష్టం అంటే తెలుసు. బాధ అంటే ఇంకా బాగాతెలుసు. అందుకే ఆ అభాగ్యుడికి ఒకచేత్తో సపర్యలు చేస్తూనే, మరొక చేతిని కాల్చుకొన్నాడు. లేకుంటే ఆ పూటకు బువ్వ?-

ఆ అభాగ్యుడి పేరు వెంకట్రాయులు. తెల్లారేసరికి తేరుకొనేటట్టు సేవలు చేశాడు. ఆ పూటకు ముగ్గురికి సరిపడే వంట పూర్తి చేశాడు. ఇక ఎదురుచూస్తూ ఉందికదా డ్యూటీ!

కాకి నిక్కరు కాకి చొక్కా తొడుక్కుంటాడు. ఆకుపచ్చని గుడ్డ తలపాగా చుట్టుకొంటాడు. కిర్రుచెప్పులు తొడుక్కుంటాడు. మచ్చుకత్తి చేతపట్టుకొంటాడు. బయలుదేరతాడు. తన బతుక్కు ఉద్యోగం మినహా ఆధారంలేదు. బాధనో బరువునో పంచుకొనే వ్యక్తి లేదు. ప్రాణాధారమైన ఉద్యోగాన్ని పై అధికారులు 'సెభాస్!' అనే రీతిగా నిర్వహిస్తున్నాడు.

ఉదయాన బయలుదేరతాడు. నిలిచిన చోట నిలబడకుండా తిరగతాడు. ఆ అడవిలో మొలిచిన ప్రతి మొక్కను రక్షించే బాధ్యత తనదిగా భావిస్తూ తిరగతాడు. ఏ సాయంకాలానికో తిరిగి ఇల్లు చేరుకొంటాడు.

అయితే ఆలోపుగా వేలెడెంత బుల్లోడు వేణు?-

ఆ ఫారెస్ట్ బంగళాకు కూత దూరంలో మొక్కల పరిశోధనా కేంద్రం. ఆ పరిశోధన నిర్వహణకొక ఉద్యోగి. పేరు పురుషోత్తం. చీమకైనా చిన్న మొక్కకైనా హాని తలపెట్టని మంచి

మనిషిగా పరిశోధన కేంద్రంలో పనివాళ్ళు మెచ్చుకొంటూ ఉంటారు. ఆ పురుషోత్తం వేణుకు తోడు. వేణు పురుషోత్తానికి కాలక్షేపం!

తాను పెంచుతున్న మొక్కల్లో ఒక మొక్క వేణు. ఆ మొక్క ఎదగడానికి ఎన్ని విధాల ప్రయత్నించాలో పురుషోత్తం తీరిక వేళల్లో అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాడు. వేణు వ్యక్తిగా ఎదుగుతున్నాడు.

ఆ రోజు గంగులయ్య డ్యూటీకి బయలుదేరుతూ–

"నాయనా! ఈ పూట నేను తొందరగానే ఇంటికొచ్చేస్తా. తాతా నువ్వు బువ్వ తినండి. ఈ వేళనుంచి తాత నీకు తోడుగా ఉంటాడు. మంచి కథలు చెప్తాడు. వింటూ ఉండు. ఆలోపలే నేనూ వచ్చేస్తాను." అన్నాడు మనంవడితో.

"నువ్వు పొయ్‌రాబో తాతా!" ధీమాగా అన్నాడు వేణు.

వేణు ఆరోజు ఎంతో ఆనందంగా ఉన్నాడు.

తాత కాకిబట్టల కరుకుదనంతో బయలుదేరుతుంటే వేణు అవుట్ హౌస్ ముందు నిలబడ్డాడు. తాత కనిపించినంతవరకు చూస్తూ నిలబడడం అలవాటు. ఆ పసి మనసుకు అదొక తృప్తి. తాత కనుమరుగయ్యే వరకు చూస్తూ అలానే నిలబడి ఆ తర్వాత వేణు ఇంట్లోకి వచ్చాడు.

ఇప్పుడు ఇంట్లో ఒక కొత్త తాత!

ఆ తాత పక్కన కూర్చున్నాడు.

"చెప్పు తాతా! ఇప్పుడు చెప్పు. నువ్వక్కడ ఎట్లా పడిపొయ్‌నావో చెప్పు తాతా?"

ఏమని చెబుతాడు తాత?–

"ఈ నోటితో ఎట్టా సెప్పేదబ్బా? సెప్తే ఆ పసి మణుసు ఎన్నెన్ని రకాలుగా ఆలోసిస్తుందో? ఎంతబాదపడి పోతిందో? ఎట్ట సెప్పేదబ్బా?" అని ఆలోచిస్తున్నాడు తాత.

"ఏంవి తాతా ఆలోచిస్తున్నావే?"

"నా మనంవడు గ్యాపకాని కొచ్చినాడు నాయ్‌నా!"

"నిజంగా నీకు మనంవడుండాడా తాతా?"

"ఉండాడయ్యా! అంతా నీ పోలికే!"

"అవునా?"

"ఆ ముక్కు...ఆ కన్ను తీరు...ఆ రంగు...అంతా నువ్వే అనుకో!"

"ఎక్క దుండాడు తాతా?"

"మా ఊళ్ళో ఉండాడు."

"మీ ఊరెక్కడుండాది?"

"మాది పరంవటపక్క గద నాయినా!"

"అయితే ఇక్కడికెందుకొచ్చినావు తాతా?"

"పరంవట పక్క మూడేండ్లుగా సినుకు నేల రాల్లా. సినుకు నేల రాలకుండా ఉంటే ఇంక సేద్దిం నాద్దిం ఎట్టా జరిగితింది? మణిసికి తిండి లేకపాయ. గొడ్డుకు కసువు లేకపాయ. ఇంక ఆకొంపల్లో ఎట్టా బతకమంటావ్? అందుకే తట్టాబుట్టా ఎత్తినెత్తినబెట్టుకొని ఇల్లెలబార్తింవి. అద్దో ఆ కొండల నడిమిద్దె సెరువు పని జరగతా ఉంటే ఆడ పన్జేసుకుంటా ఉంటింవి."

"ఈ అడవిలో చెరువా? ఎందుకు తాతా?"

"ఈ కొండల్లో కోనల్లో పద్దాఉండే వాననీళ్ళన్నీ ఉర్దాగాపోతా ఉండాయిగదా? సెరువు గట్టి ఆ నీళ్ళను నిలగట్టే? కాలవల గుండా తీసుకొని పోతే పంటల కుపయోగపడ్తాయి గదా?"

"ఓహో! అదా సంగతి! అయితే చెరువు పని పూర్తయిందా తాతా?"

"అవును నాయినా! సెరువు కట్టేపని అయ్‌పాయ. మాపక్కన గూడా నాలుగు సినుకులు రాల్నాయని తెలిసె. ఊరు జేరుకుందాంవని ఎలబార్తింవి. ఒంట్లో రసి ఉండేవోళ్ళు నడస్తారు. వాళ్ళకేం? రంయ్‌మని నడస్తారు. వాళ్ళతో పోటీ పడి నడ్సేదానికి నావల్ల అవితిందా? అప్పటికీ సెగితి కాడికి నడస్తానే ఉండా. ఆ తొందర్లో కాలికి రాయిదగిలె. పడ్తి. పడిందే పడిందే పాయ్ కోనలో పడ్తి. దొల్లు దొల్లు పుచ్చకాయ మాదిరి దొల్లిపోతి. ఆ సెట్టు అడ్డం పడకుండా ఉంటేనా?- ఇయ్యిరవకే ఏ నక్కలో చిరతలో కాకులో గెద్దలో ఏరక తినేసుందు. ఇంతకూ ఈ బూమ్మీద ఇంకా నూకలు సెల్లిపోలా!"

"మీవాళ్ళందరు ఏమైనారు తాతా?"

"వాళ్ళు తిరిగి సూసుకోనుంటే గదబ్బోడా? అడివి. పొద్దుపోతాఉండాది. పొద్దుండగానే అడివి దాటుకుందాంవని వాళ్ళ తాపేత్రం. ఎవురి తాపేత్రం వాళ్ళది గదా?"

"నువ్వు రాలేదని వెదుక్కోరా తాతా?"

"ఎందుకెతుక్కోరు నాయ్‌నా? ఎతుక్కోనుంటారు. ఎతుక్కోనుణ్ణా 'నిదానంగా వస్తాళ్ళే? ఏంవన్నా సిన్న పిలగాడా దోవాడొంకా తప్పాయిందనేదానికి?- అనుకోని వాళ్ళ దోవన వాళ్ళు పొయ్యుంటారు."

తాత కథలు చెబుతాడంటే నిజంగానే మంచి కథ చెప్పాడు.

వేణు కథ విన్నాడు. 'అయ్యో, పాపం!' అనుకొన్నాడు.

"అయితే నువ్వు ఇక్కడే ఉండిపో తాతా!"

అందుకే పిల్లల్ని దేవుళ్ళంటారు.

"కట్టుకున్న మణిసి ఏకాకిని జేసి తన దోవ తాను సూసుకుండె. తా నేంవో సుకపడిపాయ. కన్నగసాట్లు పడి కొడుకును పెంచి పెద్దోణ్ణిజేసి పట్టరాని కాళ్ళుపట్టి వాణ్ణేమో ఒకఇంటోణ్ణి జేస్తే వాడికి కాసింత కనికారం లేకుండా పాయ. ఇంకెందుకు బతకాలనుకుంటా ఉంటే మల్లా ఇదొక బందం. ఏ మహాతల్లి కడుపుపంటో ఈబిడ్డ?"

తాత కన్నులు పల పల వర్షించాయి!

"తాతా తాతా! ఎందుకు తాతా ఏడుస్తున్నావే?"

"అది ఏడుపు కాదు నాయినా...! ఆనందం."

"ఆనందం కలిగినప్పుడు హాయిగా నవ్వుకోవాలగానీ– ఎవ్వరైనా ఏడస్తారా? అదిగాదులే. నువ్వు మాతో ఉండాలంటే ఏడుస్తున్నావ్."

"రాఁవ రాఁవ! అట్లనుకోనుంటే నాకు పుట్టగతులుండవు. ఉండదానికేం నాయినా బంగారుగా ఉండిపోవచ్చు. మరి నా మనఁవడు?"

"నీ మనఁవడి కేం తాతా? అమ్మానాన్న ఉన్నారు గదా?"

"ఉండారనుకో. అయినా ఎవుడికైనా తాత తాతే గదా? ఒక మాటడగతాను. మీ తాతను ఇడ్సి పెట్టేసి నువ్వుండమంటే ఉంటావా?"

"ఉండను. ఉండలేను!"

"నా మనఁవడుగూడా అంతేగద నాయినా?"

వేణు ముఖం గంభీరంగా మారిపోయింది. తల వాలిపోయింది. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుంది.

వేణు ఆప్యాయతను తలపోస్తుంటే తాత గుండెల్లో పొంగు. లొక్కి దవడల్లో తొంగి తొంగి చూస్తున్న వెలుగు రేఖలు. కన్నుల్లో తొక్కిసలాడుతున్న సందేహాలు.

"అయితే ఒక పని చేస్తాం తాతా!"

"సెప్పు నాయినా!"

"నీ మనవఁవడిని కూడా తీసుకొని నువ్వు ఇక్కడికొచ్చేయి. నీ మనఁవడు కూడా నాలానే ఉంటాడన్నావ్ గదా? అప్పుడు మే మిద్దరం అన్నాతమ్ముళ్ళవుతాం. బాగా చదువుకుంటాం. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తాం. ఇద్దరు తాతల్నీ ఇల్లు దాటకుండా చూసుకుంటాం."

అబద్ధం చెబుతున్నామని ఒకబాధ. చెప్పక తప్పలేదే అని అంతకుమించి ఇంకొక బాధ. అడకత్తెరలో పడినట్టయింది. తపన పడిపోతున్నాడు తాత!

"మాట్లాడవేం తాతా? నా ఆలోచన బాగాలేదా?"

"బెమ్మాండంగా ఉండాది నాయినా!"

తాత గొంతు బొంగురు పోయింది. వేణు గమనించే స్థితిలో లేడు. ఆ అడవిలో తన కొక తోడు దొరుకుతుందని ఆనందలహరిలో తేలిపోతున్నాడు.

పసిమనస్సుతో అబద్ధాలు. తాత మనసు విలవిల్లాడిపోతూ ఉంది.

వేణు రెక్కలు వచ్చిన పిట్టలా పరిశోధనా కేంద్రంవైపు పరుగెత్తాడు!

* * * * *

"తాతా!"

పరిశోధనా కేంద్రంలో రాలిన ఎండుటాకుల్ని పూతా పిందెను చెత్తా చెదారాన్ని ఊడ్చి గంపలకెత్తుతున్న వెంకట్రాయులు తాత ఆ పిలుపుతో ఉలిక్కి పడ్డాడు.

ఆప్యాయంగా వినిపించినా అది ఆఫీసర్ పిలుపు!

ఒకతరానికి చెందిన తాతకు ఆపిలుపు విలువ తెలుసు. ఎగిరిపడి లెయ్యాలని మనసు హెచ్చరిస్తూ ఉంది. కానీ వయస్సు?-

మెల్లగా లేచి నిలబడ్డాడు.

"పిలిస్తే పలకాలా? లేచి నిలబడాలా తాతా?"

"దేవరవారు ఎదురుంగా నిలబడుకోనుంటే..."

"దేవర కాదు. దెయ్యమూకాదు ముఖ్యం. చేస్తున్న పని!"

ఆమాటతో కూడా పనిలోకి వంగాడు తాత.

"అదీ పద్ధతి. అలా ఉండాలి నడవడి. అది సరేకానీ తాతా? పెద్ద సిఫారస్‌తో పనిలో చేరావు కదా? ఎలాఉంది పని?"

"రెక్కలుముక్కలు జేసుకొన్నజల్మకు ఇదొక లెక్కాపక్కా సాఁవీ? అంతా తఁవరి దయేగదా?"

"నా దేముంది? అంతా నీమనఁవడు వేణూ ఉన్నాడుగదా? వాడి దయ. వాడు పట్టుబట్టి గదా నిన్నిక్కడ పనికి కుదిర్చాడు."

"ఏ మహాతల్లి కడుపు పంటో..? బంగారు కొండ! అటుమంటోడికి తాతను కావాలంటే నా మాదిరి యదవలు ఎన్ని జల్మా లెత్తాల్నో? అయినా ఆ పిలగాడి మాటెత్తుకుంటే సాలు. కడుపులో సెయ్యేసి దేవినట్టవితింది."

"ఎందుకు తాతా?"

"ఏఁవని సెప్పమంటావయ్యా? ఈ బతుకు ఎండన నిలబడుకోనుంటే నీడకు రమ్మని పిల్సేవాళ్ళు లేరు. నిలబడుకోనుంటే కూసోమని సెప్పేవాళ్ళు లేరు. దాహఁవంటే నీళ్ళిచ్చే వాళ్ళు లేరు. ఆకలంటే అంత అన్నం పెట్టేవాళ్ళు లేరు. ఆ అబ్బోడే పట్టుబట్టకుండా ఉంటే ఈ కట్టె ఇయ్యేరవకే ఆ కోనలో కాకుల గెద్దలపాలై పొయ్యుండు. అటుమంటోడిని బతికించె. నిలవ నీడనిచ్చె. చేసుకుందేదానికొక పని తీసిచ్చె. అటుమంటి కన్నోరుకే అపద్దం సెప్పినానఁే? అని."

"అబద్ధం చెప్పావా?"

"అవును సాఁవీ!"

"ఏఁవని?"

'ఈ నోటితో ఎట్ట సెప్పమంటారు దేవరా? ఈ లోకంలో ఒక కొడుకు ఒక తండ్రిని అవసాన కాలంలో కడుపుకంత కూడుపెట్టలేకుండా కాళ్ళకు బందవఁవతాడని... సెయ్‌రాని పన్జేసి పొయ్‌నాడని ఎట్ట సెప్పమంటారు సాఁవీ!"

వెంకట్రాయులు తాత గొంతు రుద్ధమయింది.

"తండ్రికే కొడుకు చెయ్యరాని పని చేశాడా?"

"సిన్నం గంటా రామాట? కన్న కొడుక్కే బారంవైపోతి. ఈ బారాన్ని తొలగదోసుకోవాలనుకున్నాడు. అది వాడికి పుట్టిన బుద్దిగాదు. వాడి పెండ్లాం పురెక్కించె. ఈ కాలాన పెండ్లాం మాట్లంటే బెల్లంవే గదా? నా కొడుకు ఊ కొట్టినాడు. పోతాపోతా ఏదో ఒక చినిగిన చేటనో చెప్పునో ఇసిరట్టా పారేసినట్టు నన్నా కోనలో తోసేసి పాయ్‌రే!"

"అం!"

"యాడికి పోవాలన్నా ఏపని సేసుకోవాలన్నా ఈ ముసిలోడ్తో పెద్ద పీకులాట. ఈ సచ్చీ సావనోడ్తో ఎంత కాలంవని ఏగులాడాల్నో ఏంవి కర్మంవో? సావనీక బతకనీక సాదిస్తా ఉండాడు. కొంపలో ఒక అడ్డం. కూలికి పోదాంవంటే ఒక అడ్డం. యాడనో ఒక సోట ఎట్నోవొకట్టా దొంగలు తోలేస్తే సరిపోలా?" అని కోడాలు పిల్ల అంటానే ఉండాది. నేనింటానే ఉండా. అయినా రగతం పంచుకోని పుట్నోడే వాడే ఈ కాడికి వగతెగిస్తాడని నేను కల్లో గూడా అనుకోలా."

"ఒరే దుర్మార్గుడా? ఎంత పని చేశావురా?"

"సాంవీ! ఈ లోకాన తండ్రిని జంపిన బిడ్డలుండారు. లేదనే దానికి లేదు. ఉండే ఆస్తి పాస్తులు సరిగ్గా పంపకం సెయ్యలేదనో...అన్న నొక ఇదంగా...తమ్ముణ్ణి ఇంకొకిదంగా సూస్తా ఉండాడనో...ఇనప్పెట్టెలో గంటుతో ఇల్లామల్లి అట్లు ఆడ్తా ఉండాడనో...తల్లిని గాదని ఇంకొకదాన్ని మరిగినాడనో- తండ్రిని జంపిన కొడుకులుండారు. కానీ, కాటికి కాళ్ళు సాపుకోనుండే ముసిలోడికి అంత పిండాకూడెయ్యలేకుండా ఇంత అన్నేయానికి పాలుమారిన కతలు ఎప్పుడూ ఇన్లేదు. ఎక్కడా సూళ్ళేదు."

"నిజంగా ఇది హత్య! హత్యకు పాల్పడిన వాడిని క్షమించడం తప్పు. నిజంగా నువ్వు చేసింది పొరబాటే!" అంటూ పండ్లు పటపట కొరుకుతున్నాడు పురుషోత్తం.

"సాంవీ! మీ మాటకు అడ్డం పడ్తా ఉండాననుకోబాకండి. నా సిన్నతనాన ఊళ్ళో వాళ్ళ ఆవుగొడ్ల మేపుకుంటా ఉంటి. ఆ పొద్దు ఆవు గొడ్లు గూటం కొండ మింద మేస్తా ఉండాయి. పొద్దు తిరగతా ఉండాది. ఆయాళకాడ తెల్లావు సూటుది. ఆ అడవిలో బండమిందనే ఈనేసింది. దూడ దూడెనకమాయ. ఏటవాలుగా ఉండే ఆ బండమింద పడీ పడతానే జారిపాయ. సరసర జారి వాగులో పాయ్ పడె. సాంవీ! ఈ కండ్లతో సూస్తానే ఉండా. నిజం జెప్పినా ఇంటారు. అపద్దం జెప్పినా ఇంటారు. ఆవు దూడతో గూడా ఎగిరి దూకె వాగులోకి. దూడ పక్కన బడె. దాని కాలిరిగిపాయ. అయినా లెక్కజెయ్యకుండా దూడ వొళ్ళు నాకతా ఉండాది. అట్టుంటుందయ్యా తల్లీ బిడ్డల మద్దె మంవకారం!"

పురుషోత్తం ఈ లోకంలో లేడు. శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నట్లుంది. అసలు తాత చెప్తున్నది వింటున్నాడా లేదా అన్న సందేహం. కానీ తాత అతను వింటున్నాడా లేదా అన్న సందేహానికి తావులేకుండా స్వగతంలాగా-

"సేతల బలంతాన ఆ గొడ్డును ఇల్లు జేరిస్తింవి. కాలికి కట్టు కట్టిస్తింవి. ఇరిగిన కాలు అతుక్కుండె. తెల్లావు ఆ పొద్దుట్నుంచి కుంటావాయె. నోరూ వాయి లేని గొడ్డే బిడ్డల మిందింత

మంవకారం సూపిస్తా ఉంటే– అన్ని తెలువులు గల మణుసులు మనం. బిడ్డేదో తప్పు జేసినాడని..."

"ఏమన్నావు తాతా?"

"అదేనయ్యా! బిడ్డల మింద నోరు లేని గొడ్లే..."

"అదిగాదు తాతా? తెల్లావు ఏమయింది?"

"కుంటావు అయింది!"

పురుషోత్తం కండ్లల్లో నీళ్ళు పలపల రాలాయి!

"అయ్యయ్యో! ముదనష్టపోణ్ణి! నా కడుపుసొద ఎలబోసుకోని తంవరి కంట్లో నీళ్ళు తెప్పిస్తినే?"

కుంటి ఆవు మాట చెవిని పడ్డాక పురుషోత్తం చెవుల్లో మరొక మాట పడలేదు. అతని ఆలోచనల్లో కుంటిమంగమ్మ చోటు చేసుకొనింది.

కన్నీళ్ళు చిప్పిలుతున్న కండ్లు. వెర్రిచూపులు. అవి కూడా శూన్యంలోకి. వెంకట్రాయులు తాతకు పురుషోత్తం తీరు అర్థం కాలేదు. చేతులు కట్టుకొన్నాడు. మబ్బుగుములు కొండ కొమ్ముల్ని ముద్దులాడుతున్నాయి. చెట్లమీద పిట్టలు చెవుల కింపుగా రాగాలు తీస్తున్నాయి. పరిశోధనా కేంద్రంలో ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

కండ్ల ముందు కదలాడుతున్న దృశ్యాన్ని నిర్నిమేష దృష్టితో చూస్తున్నట్లుగా పురుషోత్తం!

కుంటి మంగమ్మ! కాదు. మంగమ్మ. అందగత్తె కాకపోయినా అనాకారి మాత్రం కాదు. మంగమ్మ తల్లిదండ్రులు ఈడూ జోడు చూశారు. పెండ్లి చేశారు. కూలి కొడవలి చేతి కిచ్చారు. కూలి కొడవలి చేతికిచ్చారని కుమిలికుమిలి ఏడవలేదు మంగమ్మ. కుశాలగ కాపురం చేసింది. మగడొక కూలి పనికి పోతే తానొక కూలిపనికి పోయింది. వాళ్ళకేం? 'చిలకా గోరింకలు!' అన్న పేరు తెచ్చుకొనింది.

అయితే విధి వాళ్ళ అన్యోన్యతను ఓర్చలేకపోయాడు.

ఆమెను ఒకతల్లిని చేసి అంతవరకే తనబాధ్యత అన్నట్టు భర్త పోయాడు.

మగనితో కలిసి కూలి పనులకు వెళ్ళే మంగమ్మ చంక బిడ్డతో కూలికి వెళ్ళింది. చెట్టు కొమ్మకు కట్టిన కోక ఉయ్యాల్లో చంటి బిడ్డ. పొలం పనిలో తాను. ఆ పసికూన ఏడిస్తే పాలిచ్చి వస్తానంటే మునం వెనకబడి పోతుందని ఎన్ని సూటిపోటి మాటలో?–

కొమ్మకు కట్టిన కోక ఉయ్యాల్లో కసుగందు. వాడికేం తెలుసు? తనకు పాలివ్వడానికి వస్తే తల్లి పడుతున్న సూటిపోటు మాటలు? వాడి ఆకలి వాడిది. వాడి ఏడుపు వాడిది.

సాధింపులు వేధింపులతో సతమతమవుతూనే చంటి బిడ్డను సాకింది.

బిడ్డ చంక దిగాడు. దోగాడాడు. తప్పటడుగులు వేస్తున్నాడు.

ఆ సమయంలో ఒకానొక రోజు–

బిడ్డకు పాలిచ్చింది. పాలు తాగుతూ నిద్రపోయిన బిడ్డను కోక ఉయ్యాల్లో పడుకోబెడ్డింది. తాను వెళ్ళిపనిలో వొంగింది.

ఉయ్యాలలో బిడ్డ ఎప్పుడు దిగాడో... ఎలా దిగాడో? దిగాడు.

దోగాడుతూ దోగాడుతూ వెళ్ళాడు.

ప్రక్కనే ఉన్న పాడుబావిలోకి దొర్లుకున్నాడు!

"నీ కొడుకు పాడు బాయిలో పణ్ణాడే మంగా!" అన్నారు చూచినవాళ్ళెవరో!

మాట చెవిని పడిందో లేదో- మంగమ్మ పరుగందుకొనింది. ఎగిరి పాడుబావిలోకి దూకింది!

దొరువులు ఏటవాలుగా... దట్టంగా పెరిగిన కసువు అడుగు భాగంగా పాడుబావి. ఏటవాలు తలంమీద దొర్లిన బిడ్డ మెత్తటి పరుపులాంటి కసువు మీద గుక్కపట్టి ఏడుస్తున్నాడు. మంగమ్మ బిడ్డను రెండు చేతులతో జవురుకొనింది. గుండెకు హత్తుకొనింది. ఒళ్ళంతా తడిమి తడిమి చూసింది. దెబ్బలేమీ తగలలేదు.

అయితే పాపం! మంగమ్మకు కాలు విరిగింది.

ఆరోజునుండి మంగమ్మ కుంటి మంగమ్మ అయింది.

కుంటి మంగమ్మ కుంటుకుంటూ కుంటుకుంటూనే కూలిచేసింది. కొడుకును పెంచింది. పెద్ద చేసింది. చదివించింది. పెండ్లి చేసింది.

ఇప్పుడు కొడుకు పెద్ద ఆఫీసర్!

కుంటి మంగమ్మ బిడ్డకోసరం పడిన పాట్లను... అగచాట్లను ఆ పాయకట్టులో ఇంకా కథలుగా చెప్పుకొంటూనే ఉన్నారు.

ఇంతకూ ఎవరా కుంటి మంగమ్మ?

తన తల్లి!

ఇప్పుడు ఎక్కడుందా కుంటిమంగమ్మ?

వృద్ధాశ్రమంలో ఒక అనాథగా!

ఎందువల్ల?

కుంటిమనిషి కొంపలో ఉంటే తన కాపురం కుంటుపడుతుందని భార్య శతపోరింది కాబట్టి!

గతస్మృతితో పురుషోత్తం కన్నులు అవిరళంగా వర్షిస్తున్నాయి!

వెంకట్రాయులు తాత చలించిపోయాడు.

"అయ్యయ్యో! వాడొక పనికిమాల్నె యదవ. వాడు జేసి పొయ్న పనికి తంవరట్టా కరిగి కన్నీరైపోతే ఎట్టదేవరా? ఇప్పుడు నాకేం తక్కవయిందని? కడుపులో పుట్నోడే కానల పాల్జేసిపోతే కడుపులో పెట్టుకొని కాపాడ్తా ఉండారే. ఎందుకు? ఇదేంవన్నా రగతసంబందంవా? కాదే? అబిమానం. మణిసికి కావాల్సిందదే. అదనేదే ఉంటే ఈలోకంలో అనాదనేవాడే ఉండడు. అందుకే అది మణిసికి కావాలనేది."

'ఏమన్నావ్ తాతా? మనిషికి కావలిసింది రక్తసంబంధం కంటే అభిమానమా? మనిషిని అభిమానించే గుణమే ఉంటే లోకంలో అనాథలే ఉండరా? అవును. అభిమానమే ఆస్తిగా కలిగిన గంగులయ్య మనిషి. నువ్వూ మనిషి. వేణూ మనిషి. కానీ నేనూ, నీ కొడుకు మాత్రం మనుషులమే కాము. కాము!' అని గొంతెత్తి అరవాలనుకొన్నాడు. అయినా ఆ పని చేయలేక పోయాడు.

ఎవరైనా ఆ పరిస్థితుల్లో నిస్సహాయత కరిగి నీరైతే?– ఆ పరిస్థితికి దాసుడే!

"దేవరా! దేవరా! అదేంది దేవరా? అన్నీ ఎరిగినోళ్ళు. తంవరే ఇట్టా కుంవిలి కూరాకైతే ఎట్టా? అయినా తంవరికి తెలియని దేంవుండాది? ఈ తోటలో ఇన్ని సెట్లుండాయి. సెట్లన్నీ పూస్తా ఉండాయి. పూసికాస్తే కాయదారి కాయదే! పువ్వుదారి పువ్వుదే! పువ్వూ కాయే గాదు. తల్లీ బిడ్డయినా అంతేగదా? అయినా దేవరా? ఈ లోకంలో సినిగిపాయ్న కాగితాన్ని ఇరిగి పాయ్న ఇనప ముక్కను కడాన సచ్చిన గొడ్డును దేన్నీ ఇసిరట్టా పారెయ్యలేని మణిసి అవసాన కాలంలో అబ్బా, అమ్మను మాత్రం..."

"తాతా!"

"అవున్నాయినా! ఈ లోకంలో అన్నిటికి అంతో ఇంతో విలవుండాది– ఒక్క అబ్బా అమ్మను తప్పిస్తే! కనిపెంచినోళ్ళకే వాళ్ళేం సెద్దజేస్తా ఉండారని దేవుడిట్టా చేస్తా ఉండాడో ఏమో? వాడికే ఇంత వలపచ్చిం ఉండాదంటే ఇంక మణుసుల కతేం ఉండాదిలే?"

"వలపక్షమా?"

"కాదా మరి? అన్ని పూలకత వొగ్గిటైతే అలసంద పువ్వు కత ఇంగొకిటి. కాయ కాయగా ఏర్పడేదాక పువ్వు కాయని కనిపెట్టుకునే ఉంటిందిగదా?"

"ఎంత గొప్ప అవగాహన తాతా! నాది శాస్త్రం. నీది తత్త్వం. ప్రకృతి అధ్యయనం శాస్త్రం. సృష్టి అవగాహన తత్త్వం. అందుకే శాస్త్రం వేరు. అవగాహన వేరు. నీ తత్త్వ జ్ఞానానికి జోహార్! అలసంద పువ్వే కాదు. ఏ పువ్వు అయినా సరే! ఏ తల్లి అయినా సరే! పువ్వు కాయకు, తల్లి బిడ్డకు రూపం ఇచ్చినప్పుడే వాళ్ళ బతుకుల్లో క్షీణదశ ప్రారంభం. ఇది తెలిసికూడా పువ్వు కాయకురూపం తల్లి బిడ్డకుజన్మ ఇవ్వకుండా ఉండలేరు. అన్న ప్రకృతి ధర్మంలో ఇమిడివున్న పరమ తత్త్వాన్నే ఆలోచింప చేశావు. నాలో మానవతను మేల్కొల్పావు. నన్ను మనిషిని చేశావు. తాతా. మనిషిని చేశావు!" అంటూ ఆత్మక్షోభిస్తూ ఉంటే– పురుషోత్తం ముందుకు నడుస్తున్నాడు.

"ఏతల్లి కన్న బిడ్డో? ఎంత మంచి మణుసో? ఇటుమంటి మారాజులు ఇంకా ఈ బూమ్మీద ఉండబట్టే ఈ లోకం ఈ కాడికన్నా నిలబడుండాది!" అంటూ ముందు నడుస్తున్న పురుషోత్తాన్ని వెనుక నిలబడి చూస్తూ పాపం! అమాయకుడు వెంకట్రాయులు తాత రెండు చేతులెత్తి నమస్కరిస్తున్నాడు! ●

ఆంధ్రప్రభ
(5/12, నవంబరు 1992)